


16న సాలూరులో పిజిఆర్ఎస్

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)ను సోమవారం సాలూరులో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సాలూరులో మున్సిపల్ కార్యాలయంలో పిజిఆర్ఎస్ నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ వేదికను సాలూరు మండల పరిషత్ కార్యాలయం నుంచి మార్పు చేయడం జరిగిందని, దీన్ని ప్రజలు గమనించాలని కోరారు. మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి పిజిఆర్ఎస్ నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు తమ సమస్యలను తెలియజేయవచ్చని ఆయన చెప్పారు. జిల్లా అధికారులంతా సోమవారం సాలూరులో జరిగే పిజిఆర్ఎస్ లో పాల్గొనాలని ఆయన ఆదేశించారు.

ఏడాది పాలనలో ఏమున్నది గర్వకారణం?

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లా మంత్రి సంధ్యారాణి ప్రాతినిధ్యం వహిస్తున్న సాలూరు నియోజకవర్గంలో అభివృద్ధి మాడుగుల ముందుకు.. అరడుగుల వెనక్కు అన్న చందంగా తయారైంది. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి ఏడాది కాలంలో జరిగిన అభివృద్ధి ప్రజలు ఆశించిన స్థాయిలో లేదు. మంత్రి సంధ్యారాణి ఎన్నికల ముందు నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలు ఒక్కటీ అమలు కాని పరిస్థితి నెలకొంది. ఈనెల 12 నాటికి ఆమె మంత్రిగా బాధ్యతలు స్వీకరించి ఏడాది పూర్తయింది. ఈ ఏడాది కాలంలో మంత్రిగా సంధ్యారాణి ఇచ్చిన హామీల ను అమలు చేయకపోవడం చర్చనీయాంశమవుతోంది.

- ఎక్కడి సమస్యలు అక్కడే
- తెరుచుకోని జీగిరాం జ్యూట్ మిల్లు
- ఆకలి మంటల్లో కార్మికులు
- అసంపూర్తిగా అన్న క్యాంటీన్
- మరమ్మతులకు నోచని సామాజిక మరుగుదొడ్లు
- ఇదీ సాలూరు నియోజకవర్గం దుస్థితి

తెరుచుకోని జీగిరాం మిల్లు

మన్యం జిల్లాలో ఉన్న ఏకైక పరిశ్రమ మండలంలోని జీగిరాంలో ఉంది. సుమారు 2వేల మంది కార్మికులు ఈ జూట్ మిల్లుపై ఆధారపడి ఉన్నారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలోనే ఈ మిల్లు మూతపడింది. మూడేళ్లు దాటినా మిల్లును తెరిపించే నాథుడే కరువయ్యారు. గత ప్రభుత్వంలో గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా పని చేసిన రాజన్నదొర మిల్లును తెరిపించేందుకు కొంత ప్రయత్నం చేశారు. కార్మిక సంఘం నాయకులు, మిల్లు యాజమాన్య ప్రతినిధులతో చర్చలు జరిగేలా చర్యలు చేపట్టారు. ఈలోగా ఎన్నికలు సమీపించడంతో మిల్లు తెరిపించే ప్రయత్నాలకు ఆటంకం ఏర్పడింది. గత ఎన్నికల ప్రచారంలో టిడిపి అభ్యర్థిగా పోటీ చేసిన సంధ్యారాణి జూట్ కార్మికులకు భరోసా ఇచ్చారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మిల్లు తెరిపిస్తానని హామీ ఇచ్చారు. ఆమె మంత్రిగా బాధ్యతలు స్వీకరించి ఏడాది పూర్తయింది కానీ జూట్ మిల్లు తెరిపించడానికి ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. కొద్దినెలల క్రితం కార్మికులు మంత్రి సంధ్యారాణిని ఆమె నివాసంలో కలిసి సమస్యల్ని చెప్పడానికి ప్రయత్నించగా తనకు ముందుగా చెప్పకుండా ఎందుకొచ్చారని వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో కార్మికులు తీవ్ర అసంతృప్తికి లోనయ్యారు. మిల్లులో పని చేస్తున్న కార్మికుల్లో చాలామంది ఇప్పటికే రిటైరయ్యారు. కొంతమంది అనారోగ్యంతో మరణించారు. రిటైరైన, మరణించిన కార్మికులకు రావాల్సిన బకాయిలు కూడా ఇంతవరకూ పంపిణీ కాలేదు.కనుచూపుమేరలో మిల్లు తెరిపించే అవకాశాలు లేకపోవడంతో కార్మికులు పొట్టచేత పట్టుకొని ఉపాధి కోసం చెట్టుకొకరు పుట్టకొకరు చెదిరిపోయారు. స్థానికంగా వున్న కార్మికులు ఉపాధి హామీ పథకం కింద పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు.



మూతపడిన జీగిరాం జ్యూట్ మిల్లు

మరమ్మతులకు నోచుకోని సామాజిక మరుగుదొడ్లు

మున్సిపాలిటీ పరిధిలో మురికివాడల్లో నివసించే మహిళలకు మేలు చేసేలా సామాజిక మరుగుదొడ్లు నిర్మించారు. పట్టణంలో దాదాపు 50 ప్రదేశాల్లో ఈ మరుగుదొడ్లు వున్నాయి. అయితే ఇవి గత కొంతకాలంగా నిరుపయోగంగా మారాయి. ఈ మరుగుదొడ్ల నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో పాడయ్యాయి. రన్నింగ్ వాటర్ సౌకర్యం లేక, మరుగుదొడ్ల తలుపులు పాడవ్వడంతో పేద మహిళలు వినియోగించడం లేదు. అయితే మంత్రిగా సంధ్యారాణి బాధ్యతలు చేపట్టిన వెంటనే మున్సిపల్ కార్యాలయాన్నీ తనిఖీ చేశారు. ఆ సందర్భంగా ఆమె సామాజిక మరుగుదొడ్ల మరమ్మతు చేయాలని అధికారులను ఆదేశించారు. మున్సిపాలిటీలో నిధులు లేకపోవడంతో మరమ్మతు పనులు చేయలేమని అధికారులు చేతులెత్తేశారు. జిల్లా కలెక్టర్ నుంచి నిధులు మంజూరు చేయిస్తానని, పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆమె ఆదేశించారు. కానీ ఇంతవరకు ఆమె ఆదేశాలు కార్యరూపం దాల్చలేదు. మంత్రి హోదాలో ఉండీ కూడా నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి చొరవ చూపకపోవడం చర్చనీయాంశమవుతోంది.



మరమ్మతులకు నోచుకోని సామాజిక మరుగుదొడ్లు

అసంపూర్తిగా అన్న క్యాంటీన్

పేద, మధ్యతరగతి ప్రజలకు ఆహారం పంపిణీ చేసేందుకు ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా చాలా పట్టణాల్లో అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేసింది. పట్టణాలకు వేర్వేరు అవసరాల కోసం వచ్చే గ్రామీణ, పట్టణ ప్రాంత ప్రజలకు చౌక ధరకు అన్న క్యాంటీన్‌లో ఆహారం పంపిణీ చేస్తున్నారు. దీనిలో భాగంగా పట్టణం నడిబొడ్డున ఉన్న మండల తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో అన్న క్యాంటీన్ నిర్మాణానికి మంత్రి సంధ్యారాణి శంకుస్థాపన చేశారు. పట్టణ టిడిపి నాయకులకు అన్న క్యాంటీన్ నిర్మాణ పనులు చేపట్టారు. శ్లాబ్ నిర్మాణం జరిగింది. మరో 50 శాతం పనులు మిగిలి ఉన్నాయి. కాంట్రాక్టరుకు బిల్లు మంజూరు కాకపోవడంతో పనులు నిలిపివేశారు. నిర్మాణపనులు ప్రారంభించి ఆరునెలలైనా ఇంతవరకూ బిల్లు మంజూరు కాలేదు. దీంతో అన్న క్యాంటీన్ అసంపూర్తిగా దర్శనమిస్తోంది. తహశీల్దార్, సబ్‌రిజిస్ట్రార్, మున్సిపల్ కార్యాలయాలకు పనుల కోసం వచ్చే గ్రామీణ ప్రజలకు అన్న క్యాంటీన్ ఎంతో ఉపయోగపడుతుందని భావించారు. మంత్రి సొంత నియోజకవర్గంలో ఏర్పాటైన అన్న క్యాంటీన్ అసంపూర్తిగా మిగిలి వుండడం చర్చనీయాంశమవుతోంది.

పూర్తి కాని వందపడకల ఆసుపత్రి నిర్మాణం

నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించే వందపడకల ఆసుపత్రి నిర్మాణం ఇంకా నత్తనడకన సాగుతోంది. గత ప్రభుత్వ హయాంలో 70శాతం వరకు నిర్మాణం పూర్తయింది. సకాలంలో బిల్లులు మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టర్ పనులు నిలిపివేశారు. ఈలోగా ఎన్నికలు రావడంతో పనులు ఆగిపోయాయి. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పెండింగ్ బిల్లులు మంజూరు కావడంతో నిర్మాణ పనుల్లో కొంత కదలిక వచ్చింది. దాదాపు 90 శాతం పనులు పూర్తయ్యాయి. జరిగిన పనులకు బిల్లులు మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టర్ మళ్లీ పనులు నిలిపివేశారు. జూన్ కల్లా వందపడకల ఆసుపత్రిని ప్రారంభిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. కానీ ఆ దిశగా అడుగులు పడడం లేదు. ఏరియా ఆసుపత్రి స్థాయికి చేరడంతో రోగుల తాకిడి ఎక్కువవుతోంది. గిరిజన గ్రామాల నుంచి రోగులు ఆసుపత్రికి ఎక్కువగా వస్తున్నారు. వర్షాలు అధికంగా పడుతుండడంతో జ్వరాలతో బాధపడుతున్న రోగులు పెరుగుతున్నారు. పేరుకు వందపడకల ఆసుపత్రి అయినా ఏర్పాటుకు వసతి లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఒక బెడ్ మీద ఇద్దరు, ముగ్గురు రోగులు పడుకోవాల్సిన పరిస్థితి కనిపిస్తోంది.


నీట్ ఫలితాల్లో మెరిసిన విద్యార్థులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్, బొబ్బిలి

శనివారం విడుదలైన నీట్ పరీక్ష ఫలితాల్లో జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు మెరుగైన ర్యాంకులు సాధించారు. విజయనగరానికి చెందిన పలువురు విద్యార్థులు శ్రీచైతన్య కళాశాలలో చదువుకొని ఆలిండియాలో ర్యాంకులు సాధించారు. పిన్నింటి వింధ్యహాసిని 404 ర్యాంక్, యు.సాయి శిరీష 440, ఎం.ఈశ్వర్ తేజ 463, ఎం.సంజన 503, పి.లావణ్య శ్రీ 507, ఎన్.అక్షయ 528, కె.నిధి 642 ర్యాంకులు సాధించారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను చైతన్య విద్యాసంస్థల ఎజిఎం నర్సునాయుడు, జోనల్ ప్రిన్సిపాల్ కె.శ్రీధర్, ఎఒ మధుసూదనరావు, ప్రిన్సిపాల్ రాంబాబు, రామచంద్రరావు, జోగినాయుడు అభినందించారు.

చీపురుపల్లికి చెందిన రోహిత్ ధనుక ఆలిండియా 6,918వ ర్యాంకు సాధించాడు. రోహిత్ విజయవాడలోని శ్రీ చైతన్య కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుకున్నాడు. ఈయన తండ్రి దిలీప్ ధనుక చీపురుపల్లిలో ట్రేడర్స్ బిజినెస్ చేస్తుంటారు. చీపురుపల్లికి చెందిన గవిడి లిఖిత 13,997వ ర్యాంకు సాధించింది. లిఖిత విశాఖపట్నంలోని శ్రీ విశ్వ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుకుంది. లిఖిత తండ్రి గవిడి నాగరాజు చీపురుపల్లి కనకమహాలక్ష్మి ఆలయ కమిటీ చైర్మన్‌గా ఉన్నారు. తల్లి భారతి చీపురుపల్లిలో ఒక ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయరాలుగా పనిచేస్తుంది.

బొబ్బిలి పట్టణంలోని మెహర్ కాలనీకి చెందిన మర్రాపు జయదీప్ నీట్‌లో 672వ ర్యాంకు సాధించాడు. విజయవాడ శ్రీచైతన్య కళాశాలలో చదువుతున్నాడు. ఒబిసి కేటగిరీలో 183వ ర్యాంకు పొందాడు. జయదీప్ తండ్రి రామకృష్ణ హెచ్‌ఎంగా ఉద్యోగ విరమణ పొందగా, తల్లి శోభారాణి తామరఖండి ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా పని చేస్తున్నారు. ఎంబిబిఎస్ పూర్తి చేసి పిజిలో స్పెషలైజేషన్ చేస్తానని జయదీప్ చెప్పాడు.



డి.జాహ్నవి
358వ ర్యాంకు



పి.వింధ్యహాసిని
404వ ర్యాంకు



యు.సాయిశిరీష
440వ ర్యాంకు



ఎం.ఈశ్వర్‌తేజ
463వ ర్యాంకు



ఎం.సంజన
503వ ర్యాంకు



పి.లావణ్యశ్రీ
507వ ర్యాంకు



ఎన్.అక్షయ
528వ ర్యాంకు



కె.నిధి
642వ ర్యాంకు



యశస్విని
646వ ర్యాంకు



ఎం.జయదీప్
672వ ర్యాంకు



అభిరాం
2787వ ర్యాంకు



డి.రోహిత్
6918వ ర్యాంకు

తాళ్లబురిడి విద్యార్థులకు నీట్ ర్యాంకులు

పార్వతీపురంరూరల్ : మండలంలోని తాళ్లబురిడి గ్రామానికి చెందిన విద్యార్థులు శనివారం విడుదలైన నీట్ ఎంబిబిఎస్ ఫలితాల్లో ర్యాంకులు సాధించారు. గ్రామానికి చెందిన దాసరి వెంకటరమణ, రామలక్ష్మిల కుమార్తె దాసరి జాహ్నవి ఆలిండియా 358 ఒబిసి 90 ర్యాంకు సాధించింది. ఇదే గ్రామానికి చెందిన రామకృష్ణ, జానకి కుమారుడు అభిరామ్ ఆలిండియా ర్యాంకు 2787, ఒబిసి 996 ర్యాంకులు సాధించారు. జాహ్నవి తండ్రి ఉద్యోగరీత్యా ఒడిశాలో పనిచేస్తుండగా ఆమె విశాఖపట్నంలో చదువుకుంది. అభిరామ్ తల్లిదండ్రులు పార్వతీపురం పట్టణంలో కార్పెంటరీ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరి ఇరువురికి ర్యాంకులు రావడం పట్ల గ్రామానికి చెందిన పెద్దలు, విద్యావేత్తలు వారి బంధువులు అభినందనలు తెలియజేస్తున్నారు.

యశస్వినికి 646వ ర్యాంకు

కొమరాడ : నేటి పరీక్ష ఫలితాల్లో కొమరాడ విద్యార్థిని నీరస యశస్విని మంచి ర్యాంకుతో సత్తా చాటారు. యశస్విని నీట్‌లో ఆలిండియా 646 ర్యాంకు, ఒబిసి కోటాలో 176 ర్యాంక్ సాధించింది.కొమరాడకు చెందిన యశస్విని తండ్రి నీరస శ్రీనివాసరావు పార్వతీపురం మండలం ఎంఆర్‌నగరం హై స్కూల్లో ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్నారు. యశస్విని మంచి ర్యాంకు సాధించడం పట్ల విద్యార్థిని కుటుంబ సభ్యులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందించారు.

ఐక్యంగా ఉగ్రవాదాన్ని ఎదుర్కొందాం

సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు

పార్వతీపురంలో సమైక్యతా ర్యాలీ

ప్రజాశక్తి - పార్వతీపురం

ఉగ్రవాదం, మతోన్మాదం, యుద్ధోన్మాదాలను ఐక్యంగా ఎదుర్కోవాలని, లౌకికతత్వం, మత సామరస్యాన్ని కాపాడుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు అన్నారు. స్థానిక సుందరయ్య భవనం నుంచి చర్చి సెంటర్ వరకు సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సమైక్యతా యాత్ర ర్యాలీ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గంగునాయుడు మాట్లాడుతూ ఉగ్రవాదాన్ని సమైక్యంగా ఎదుర్కోవాల్సిన సమయంలో కేంద్రంలో బిజెపి ప్రభుత్వం మతోన్మాదాన్ని రెచ్చగొట్టి మైనార్టీలపై వ్యతిరేకతను నూరిపోస్తోందని, పర్యవసానంగా ఇటీవల కాలంలో ముస్లిములపై 112 దాడులు జరిగాయని తెలిపారు. పహల్గాం ఉగ్రదాడి జరిగిన సమయంలో మతాలకు అతీతంగా అంతా కలిసికట్టుగా బాధితులకు సాయం చేశారని, అటువంటి వారికి అభినందనలు తెలపాల్సిన ప్రధాని మోడీ తీవ్ర వ్యతిరేకతను రెచ్చగొడుతున్నారని విమర్శించారు. ఆపరేషన్ సింధూర్ పేరుతో ఉగ్రవాదులను అంతమొందించామని చెబుతున్నారని, గతంలో సర్జికల్ స్ట్రైక్ పేరుతోనూ ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేశామని చెప్పారని, మరి ఇప్పటి ఉగ్రవాదులు ఎక్కడ నుంచి వచ్చారని ప్రశ్నించారు. అత్యంత సున్నిత ప్రాంతమైన పహల్గాంలోకి ఉగ్రవాదులు ఎలా చొరబడ్డారో కేంద్రం ఇప్పటి వరకూ బయట పెట్టలేదన్నారు. బిజెపికి మద్దతు ఇస్తున్న జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కల్యాణ్ ముస్లిములు పాకిస్తాన్ వెళ్లిపోవాలని ముస్లిం వ్యతిరేకతను మరింత రెచ్చగొడుతున్నారని అన్నారు. బాధ్యతాయుతమైన స్థానంలో ఉన్న పవన్ ఇలా మాట్లాడడం సరైందికాదని తెలిపారు. లౌకికపార్టీ అని చెప్పుకుంటున్న టిడిపి కూడా దీనికి సమాధానం చెప్పాలన్నారు. సిపిఎం దేశంలో సమైక్యతకు కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఆపరేషన్ సింధూర్‌ను ఆపేస్తున్నారని ప్రకటన చేయడానికి ట్రంప్ ఎవరని ప్రశ్నించారు. బిజెపి నాయకుల తీరు అత్యంత దారుణంగా ఉందన్నారు. సైనికులు, ప్రజలు మోడీ కాళ్లకు దండం పెట్టాలని చెబుతున్నారని ఇంతకంటే దుర్మార్గం మరొకటి లేదని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్.వై.నాయుడు, వి.ఇందిర, జిల్లా కమిటీ సభ్యులు గొర్లి వెంకటరమణ, పి.రాజశేఖర్, బివి రమణ, రెడ్డి వేణు, డి.రమణారావు, నాయకులు వై.మన్మధరావు, సింహాచలం, రెడ్డి ఈశ్వరరావు, ఎం.ఉమామహేశ్వరి, బి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



పట్టణంలో సిపిఎం నాయకులు నిర్వహిస్తున్న సమైక్యతా ర్యాలీ

కోటసీతారాంపురంలో ఏనుగుల గుంపు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని కోట సీతారాంపురం, పూనుబుచ్చ, ముచ్చంపేట గ్రామాల మధ్య ఏనుగుల గుంపు సంచరిస్తోంది. రాత్రి వేళలో రైతులు పొలాలకు పోవద్దని ఫారెస్ట్ అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇటీవల ఒక ఏనుగు గున్న ఏనుగును పుట్టుక ఇవ్వడంతో అక్కడే నివాసం ఉన్నాయని రైతులు చుట్టుపక్కల గ్రామస్తులు రాత్రి వేళలో ఎవరూ ప్రయాణించవద్దని కోరారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండండి

ప్రజాశక్తి -పార్వతీపురం టౌన్

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి విలువైన ప్రాణాలను కాపాడుకోవాలని ట్రాఫిక్ ఎస్ఐ పాపయ్య అన్నారు. స్థానిక పాతబస్టాండ్ వద్ద ఆటో యూనియన్ కార్మికులతో మాదకద్రవ్యాలు వినియోగం వల్ల కలిగే నష్టాలపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాల మత్తుకు ఏ ఒక్కరూ బలి కాకూడదని, దీనివల్ల ఎన్నో అనార్థాలు జరుగుతున్నాయని అన్నారు. దీని బారిన పడిన యువత తమ నిండైన జీవితాన్ని పాడు చేసుకుంటున్నారని, మాదక ద్రవ్యాలు వినియోగించినా, అమ్ముతున్నా సమాచారం ఇవ్వాలని తెలిపారు. మాదక ద్రవ్యాల సమాచారం తెలియజేసేందుకు టోల్ ఫ్రీ నెంబర్ 1972 పోస్టర్లు ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మన్యం జిల్లా టీం సిబ్బంది, ట్రాఫిక్ సిబ్బంది, ఆటో కార్మికులు, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

మన్యంలో భారీ వర్షం

లోతట్టు ప్రాంతాలు జలమయం

ప్రజాశక్తి - కురుపాం

మన్యంలో శనివారం వింత వాతావరణం చోటు చేసుకుంది ఉదయం నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు భారీ ఎండ కాసింది. దీంతో చిన్నారులు, వృద్ధులు, దీర్ఘకాలిక రోగులు తీవ్ర ఉక్కపోతకు గురై ఉక్కిరి బిక్కిరయ్యారు. ఈ నేపథ్యంలో సాయంత్రం నాలుగు గంటలయ్యేసరికి ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం నియోజకవర్గంలోని కురుపాం, జియ్యమ్మవలస,గుమ్మలక్ష్మీపురం మండలాల పరిసర గ్రామాల్లో కురిసింది. వర్షం తీవ్రతకు ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించని పరిస్థితుల్లో లైట్లు వేసుకొని ప్రయాణించాల్సి వచ్చింది. ఎండ తీవ్రత, ఉక్కపోత నుంచి ప్రజలకు ఉపశమనం కలగ్గా రైతులు ఈ వర్షంతో ఆకుమడులు దున్నుకొనేందుకు పదును కలుగుతుందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కొమరాడ : మండలంలోని మధ్యాహ్నం వరకు ఒకవైపు ఎండతో మరోవైపు ఉక్కబోతతో ఇబ్బందులు పడుతున్న సమయంలో సాయంత్రం నుంచి ఒకసారిగా వాతావరణంలో మార్పు చోటు చేసుకుంది. మండలంలోని స్వామినాయుడువలస, అర్థం, కోటిపాం, గుమ్మడ తదితరు గ్రామాల్లో ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం పడింది. ఉరుములు మెరుపులు శబ్దాలతో పొలాల్లో ఉన్న ప్రజలు తీవ్ర భయాందోళన చెందారు. సుమారు గంట పాటు వర్షం పడడంతో లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు భారీగా చేరింది. అంతరాష్ట్ర రహదారిపై ఏర్పడిన గోతులు వర్షపు నీరు భారీగా చేరి వాహనదారులు రాకపోకలకు తీవ్ర అంతరాయాన్ని కలిగించింది.

సీతంపేట : ఉదయం భగ భగ ఎండ... సాయంత్రం అయ్యేసరికి వాతావరణం చల్లబడే ఒకసారిగా ఈదురు గాలులు ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. దీంతో ప్రజలకు కొంత ఉపశమనం కలిగింది. గత వారం రోజులుగా ఉదయం ఎండ కాయడం సాయంత్రం అయ్యేసరికి వర్షం కురవడంతో ప్రజలు కూడా ఇబ్బందులు తప్పడం లేదు. అయితే ఈ ఏడాది రుతుపవనాలు తొందరగా పలకరించాయి. దీంతో వర్షాలు ముందుగానే కురుస్తున్నాయి. అయితే ఈ వర్షం అల్లం, పసుపు అటవీ ఉత్పత్తులకు మేలు జరుగుతుందని గిరిజనులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



కురుపాంలో కురుస్తున్న భారీ వర్షం

పిడుగుపడి ఫీల్డ్ అసిస్టెంట్ మృతి

వీరఘట్టం: మండలంలోని హుస్సేన్ పురానికి చెందిన ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ కండపు శ్రీనివాసరావు(47) శనివారం పిడుగు పడి మృతి చెందాడు. పోలీసులు, గ్రామస్తులు చెప్పిన వివరాలిలా ఉన్నాయి. శ్రీనివాసరావు కొంచ గ్రామానికి సమీపంలో పొలం పనులు చూసుకుని తిరిగి ఇంటి వస్తుండగా మార్గ మధ్యలో పిడుగు పడింది. దీంతో ఆయన అపస్మాకర స్థితి పడి ఉన్నాడు. ఇది గమనించిన కొంచ గ్రామస్తులు ఆటో సహాయంతో వీరఘట్టంలోని ప్రైవేట్ ఆసుపత్రికి చికిత్స కోసం తరలించారు. అయితే అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. శ్రీనివాస రావు సోదరుడు హరి సమాచారం మేరకు ఎస్సై జి.కళాధర్ ఆసుపత్రి వద్దకు చేరుకొని మృతుడి భార్య సూర్యకుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతునికి ఇద్దరు కుమారులు ఉన్నారు.



మృతి చెందిన శ్రీనివాసరావు

ప్రోత్సాహకాలు సరే... పాఠశాలల ఎత్తివేత ఎందుకు?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఇంటర్, పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ఇటీవల ప్రభుత్వం నగదు ప్రోత్సాహకాలు అందజేసింది. షైనింగ్ స్టార్స్ అంటూ వెన్నుతట్టింది. అంత వరకు అభినందనీయం. బాగా చదవిన వారిని ప్రోత్సహించడం ద్వారా వారిలో మరింత పట్టుదల పెరిగేందుకు అవకాశం ఉంటుంది. వెనుకబడిన వారిలో పోటీతత్వం మొదలవుతుంది. కానీ, విద్యార్థులను ఇంతలా ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం బడులు నడిపే విషయంలో ఎందుకు అంత శ్రద్ధ చూపడం లేదనేదే సగటు తల్లిదండ్రులను వేధిస్తున్న ప్రశ్న. ఉపాధ్యాయ పోస్టులకు ఎసరు మొదలుకుని, స్కూళ్ల మూతకు దారితీసే జిఒ నెంబర్ 117 రద్దుచేయాలని గత ప్రభుత్వ హయాంలో ఉపాధ్యాయులతోపాటు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కూడా పోరాడారు. ఈనేపథ్యంలో తాము అధికారంలోకి వస్తే ఆ జిఒను రద్దుచేస్తామని టిడిపి నాయకులు చెప్పారు. ఇచ్చిన మాట ప్రకారం రద్దు చేసినా అవే విధానాలను కొనసాగించారు. ఆ వెంటనే జారీచేసిన జిఒ నెంబర్ 19, 20, 21 ద్వారా పాఠశాలల రద్దు, ఉపాధ్యాయ పోస్టులకు కుదింపునకు కారణమైంది. ప్రస్తుతం ఉన్న మండల ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల స్థానంలో 9 రకాల పాఠశాలలను ఏర్పాటు చేసింది. ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులను సైతం సర్దుబాటు చేయడమే జీవో 19,20,21 లక్ష్యమని ఉపాధ్యాయ సంఘాలు వ్యాఖ్యానిస్తున్నాయి. ఈ జీవోల ప్రకారం ఫౌండేషన్ స్కూళ్లు, బేసిక్ ప్రైమరీ స్కూళ్లు, మోడల్ ప్రైమరీ స్కూళ్లు, పిపి -1, పిపి-2 స్కూళ్లు, యుపి స్కూళ్లు, హైస్కూళ్లు, ఏకోపాధ్యాయ స్కూళ్లు తదితర తొమ్మిది రకాల పాఠశాలలుగా మార్చనున్నారు. ఈ విధానం వల్ల పాఠశాలల సంఖ్య, ఉపాధ్యాయ పోస్టుల సంఖ్య తగ్గిపోవడం మినహా విద్యార్థులకు అదనంగా సమకూరే ప్రయోజనాలంటూ ఏమీ లేవన్నది ఉపాధ్యాయ సంఘాలు, విద్యార్థి సంఘాల వాదన. పరిస్థితులు కూడా ఇందుకు తగ్గట్టే కనిపిస్తున్నాయి. దాదాపు అన్ని గ్రామాల్లోనూ 1,2వ తరగతులతో నడిచే బేసిక్ ప్రైమరీ స్కూళ్లు ఉంటాయి. కొన్ని గ్రామాల్లో 1 నుంచి 10వ తరగతి వరకు నడిచే ఉన్నత పాఠశాలలు ఉంటాయి. ఇలాంటిచోట ప్రైమరీ, లేదా ఉన్నత పాఠశాలల్లో తమకు నచ్చిన పాఠశాలలకు పిల్లలను తల్లిదండ్రులు పంపుతారు. ఇటువంటి చోట పిల్లలు తక్కువగా ఉన్నారన్న నెపంతో ఆ గ్రామంలోని బేసిక్ ప్రైమరీ స్కూళ్లను తాజా విధానంగా ప్రభుత్వం ఎత్తివేస్తుంది. దీంతో కొన్నాళ్లకు బేసిక్ ప్రైమరీ స్కూళ్లు కనుమరుగయ్యే ప్రమాదం ఏర్పడుతుంది. ప్రస్తుతం జిల్లాలో 1 నుంచి 5 వరకు నడిచే ప్రాథమిక పాఠశాలలు 1718 ఉన్నాయి. వీటిని విచ్ఛిన్నం చేయడం ద్వారా సుమారు 1482 మోడల్ ప్రాథమిక పాఠశాలలు ఏర్పాటు చేయనున్నారు. జిల్లాలో సుమారు 235కు పైగా యుపి పాఠశాలలను ఎత్తివేసేందుకు అవకాశం ఉన్నట్టుగా ఉపాధ్యాయ సంఘాలు విశ్లేషిస్తున్నాయి. పంచాయతీ కొక మోడల్ ప్రాథమిక పాఠశాల ఏర్పాటు చేసి అక్కడ తరగతికొక ఉపాధ్యాయుడ్ని నియమిస్తామని ప్రభుత్వం చెబుతోంది. దీనివల్ల ఉపాధ్యాయ పోస్టుల సంఖ్య గణనీయంగా తగ్గిపోనుంది. ఇక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయులను ఉన్నత పాఠశాలలకు, మోడల్ ప్రాథమిక పాఠశాలలకు సర్దుబాటు చేస్తామని చెబుతోంది. మోడల్ ప్రాథమిక పాఠశాలలకు వెళ్లే 3,4,5 తరగతుల విద్యార్థులు కనీసం 3 నుంచి 5 కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లాల్సి ఉంటుంది. ఈ కారణాల రీత్యా పిల్లలను తల్లిదండ్రులు మోడల్ ప్రాథమిక పాఠశాలకు పంపించే అవకాశంలేదు. ప్రయాణ భత్యం ఇస్తామని చెపుతున్నా అది ఆచరణలో ఎంతవరకు అమలవుతుందనేది ప్రశ్నార్థకంగా వుంది. ఉన్నత పాఠశాలల్లో కేవలం ఇంగ్లీష్ మీడియం ఒక్కటే అమలు చేయడం వల్ల మిగిలిన భాషా పండిత పోస్టులను ప్రభుత్వం ఇప్పటికే మిగులు పోస్టులుగా చూపుతోంది. మరోవైపు డిఎస్‌సిలోనూ 3వేల పోస్టులకు కోత పెట్టారు. ఆ మేరకు జిల్లాలోనూ పోస్టులు తగ్గాయి. విద్యారంగ అభివృద్ధికి మౌలిక సూత్రాలను పక్కనబెట్టి షైనింగ్‌స్టార్స్ పేరిట నగదు, జ్ఞాపికలతో సరిపెట్టడం ప్రభుత్వం చేస్తున్న మోసపూరిత విధానాలను మరిపించడమేనన్నది పబ్లిక్ టాక్.



నేటి నుంచి గిరిజనులకు అవగాహన కార్యక్రమాలు

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో ఆదివారం నుంచి ధర్తీ ఆబా జన్ జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ (డిఎ జెజియుఎ) అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం జిల్లా అధికారులతో ఆయన టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. జూన్ 15 నుంచి 30 వరకు డిఎ జుగా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్యంగా ఆదివాసీ గిరిజనుల అవసరాలను గుర్తించి ధ్రువపత్రాలు జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. డిఎ జుగా నిర్వహణపై సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి జన్ జాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ (పిఎం జన్‌మన్), ధర్తీ ఆబా జన్ జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ (డిఎ జుగా) కార్యక్రమాలను అమలు చేస్తున్న విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. గిరిజన ప్రాంతాల్లో సేవలు, మౌలిక సదుపాయాలను కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాలు చేపట్టడం జరుగుతోందన్నారు. గ్రామ, క్లస్టర్ స్థాయి శిబిరాల ద్వారా వివిధ సౌకర్యాలను క్షేత్ర స్థాయిలో అందించే దిశగా ఈ కార్యక్రమం ఉద్దేశించబడిందని వివరించారు. ఈ రెండు కార్యక్రమాలను ప్రజల్లో పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని జూన్ 15 నుంచి ఈ కార్యక్రమాలు చేపట్టడమే కాకుండా వివిధ రకాల సేవలను అందించాలని ఆదేశించారు. ఆధార్, రేషన్ కార్డ్, ఆయుష్మాన్ భారత్ కార్డ్, కుల, నివాస ధ్రువీకరణ పత్రాలు, కిసాన్ క్రెడిట్ కార్డ్, పిఎం కిసాన్ కార్డులు, జన్ ధన్ ఖాతా, పిఎం జెజెబివై, పిఎం ఎస్‌బివై బీమా కవరేజ్, వృద్ధాప్య, వితంతు, వికలాంగ సామాజిక భద్రత పింఛన్లు, ఉపాధి హామీ, పిఎం విశ్వకర్మ, ముద్ర తదితర జీవనోపాధి పథకాలు, పిఎం యంవివై, ఇమ్యునైజేషన్ తదితర స్త్రీ శిశు సంక్షేమ ప్రయోజనాలు మొదలైనవి అందించడం జరుగుతుందన్న విషయాన్ని ప్రజల్లో తీసుకువెళ్లాలని ఆయన పేర్కొన్నారు. పివిటిజి గృహాలు, గిరిజన గ్రామాలను గుర్తించడం, గ్రామ, క్లస్టర్ స్థాయి శిబిరాలను నిర్వహించడం, ఆరోగ్యం, ఆహారం, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, సామాజిక న్యాయం, వ్యవసాయం, రెవెన్యూ ఇతర విభాగాల సమన్వయంతో ప్రచార కలంలో తదితర కార్యకలాపాలు చేపట్టాలని అన్నారు. ఆధార్, ఇ - కెవైసి డాక్యుమెంటేషన్ సంబంధిత సేవల కోసం సంబంధిత విభాగాలు పనిచేస్తాయని, గ్రామస్థాయిలో ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆకాంక్షించారు. ఆధార్‌లో నమోదు కాని వారిని అంగన్వాడీ సిబ్బంది నమోదు చేయించాలని పేర్కొన్నారు. సంబంధిత శాఖలు ఆదివారం నుంచి జరిగే అవగాహన శిబిరాల్లో వారికి ధ్రువపత్రాలను అందజేయాలని, మండల స్థాయి అధికారులు ఇందులో ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. టెలీ కాన్ఫరెన్స్‌లో జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బాబుతోనే పేదలకు భరోసా : మంత్రి

ప్రజాశక్తి - సాలూరురూరల్

చదివే పిల్లలు ఒకే ఇంట్లో ఎంతమంది ఉన్నా అందరికీ తల్లికి వందనం పథకం ఇస్తామని ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేడు నెరవేర్చారనీ రాష్ట్ర స్త్రీ, శిశుసంక్షేమ, గిరిజనసంక్షేమశాఖామంత్రి మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. శనివారం తన క్యాంపు కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే ఆర్‌పి భంజ్‌దేవ్‌తో విలేకరులతో మాట్లాడారు. పాఠశాలలు తెరిచిన రోజే, పిల్లలకు కొత్త పుస్తకాలు, యూనిఫారం, బెల్ట్, బూట్లు, సాక్సులు పిల్లలకు ప్రభుత్వం అందజేశారు. స్కూళ్ల తెరిచిన మొదటి రోజే డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర పథకంలో నాణ్యమైన కిట్లు ఇచ్చిన చదువుకొనే ప్రతి ఒక్కరికీ భవిష్యత్‌కు భరోసా కల్పించారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం 16 వేలకు పైగా టీచర్ పోస్టుల భర్తీకి డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తే దాన్ని ఆపేందుకు 24 కేసులు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తన మనుషులతో వేయించి రాక్షస ఆనందం పొందుతున్నారని, విమర్శించారు. తల్లికి వందనం పథకంలో రూ.2 వేలు రాష్ట్ర విద్యాశాఖామంత్రి నారా లోకేష్ అకౌంటులో పడుతున్నాయని ఫేక్ ప్రచారం చేస్తున్నారని, మీకు 24 గంటలు టైం ఇస్తున్నాం దమ్ముంటే, అది నిరూపించండి. లేదంటే తప్పు అయిపోయిందని ఆ స్టేట్మెంట్ వెనక్కి తీసుకోండి. లేదంటే, మీపై చట్ట ప్రకారం చర్యలు ఉంటాయిని మీ ఫేక్ ప్రచారం పై కఠినమైన చర్యలు ఉంటాయని వైసిపి నాయకులను హెచ్చరించారు. అలాగే పిల్లలకు పౌష్టికాహారమందించే లక్ష్యంతో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకంలో సన్నబియ్యంతో పాఠశాలలు తెరిచిన తొలిరోజు నుండే వండి విద్యార్థులకు రుచికరమైన ఆహారాన్ని అందిస్తున్నామని తెలిపారు. గత అరాచక ప్రభుత్వ ఐదేళ్ల నిర్వేదం నుంచి నూతనోత్సాహంతో నవశకం ప్రారంభమైందని తెలిపారు. విలేకరుల సమావేశంలో కార్యక్రమంలో సాలూరు పట్టణ, మండల, మక్కువ, మెంటాడ మండలాల టిడిపి అధ్యక్షులు నిమ్మాది తిరుపతిరావు, ఆముదాల పరమేష్, గుళ్ల వేణుగోపాలరావు, చలుమూరి వెంకట్రావు, ఎఎంసి చైర్మన్ ముఖి సూర్యనారాయణ, నియోజకవర్గం నలుమూలల నుంచి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న మహిళలు

తాగునీటికి కటకట
ఖాళీ బిందెలతో మహిళల నిరసన

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

పట్టణంలోని పలు వార్డుల్లో వారం రోజులుగా తాగునీటి సరఫరా లేకపోవడంతో శనివారం పలు వార్డుల మహిళలు జనసేన నాయకులు గొర్లి చంటితో కలిసి ఖాళీ బిందెలతో మున్సిపల్ కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ గత వారం రోజులుగా కుళాయిల ద్వారా తాగునీటి సరఫరా జరగలేదని, తాగునీరు, వాడుకనీటికి నానా ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. వారం రోజులకు ఒకసారి జరగడం అన్యాయమని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాచారం తెలుసుకున్న ఎఇ సన్యాసిరావు కార్యాలయం వద్దకు చేరుకుని మహిళలతో మాట్లాడారు. ఐదు రోజులుగా ఇంజినీర్ విభాగం కార్మికులు సమ్మెలో ఉన్నారని, దీంతో పాటు తోటపల్లి వద్ద ఉన్న పంప్ హౌస్ పనులు జరుగుతున్నాయని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి తాగునీరు సరఫరా చేయడం జరుగుతుంది హామీ ఇచ్చారు.

విశాఖ ఎక్స్‌ప్రెస్‌కు ఆన్‌లైన్ సౌకర్యం

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని నీలకంఠాపురం నుంచి విశాఖపట్నం వెళ్లే ఆర్టీసీ బస్సుకు (ఉదయం 4.52 గంటలకు) కురుపాం నుంచి ఆన్‌లైన్ రిజర్వేషన్ లేని కారణంగా ప్రయాణికులు ఇబ్బంది పడుతుండున్నారు. ఈ విషయమై స్థానిక ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి దృష్టికి ప్రయాణికులు తీసుకువెళ్లడంతో ఆమె వెంటనే స్పందించి ఆర్టీసీ చైర్మన్ దన్నుదొరతో మాట్లాడి కురుపాం నుండి ఆన్‌లైన్ రిజర్వేషన్ కల్పించారు. ఈ సందర్భంగా కురుపాం పరిసర ప్రాంత ప్రజలు మాట్లాడుతూ చెప్పిన వెంటనే ఎమ్మెల్యే స్పందించి ఎక్స్‌ప్రెస్‌కు ఆన్లైన్ రిజర్వేషన్ సౌకర్యం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

రహదారి విస్తరణ పనుల్లో డొల్ల
ఆలయంలోకి వర్షపు నీరు

ప్రజాశక్తి - కురుపాం

మండల కేంద్రంలో గల రహదారి విస్తరణ పనుల్లో అధికారులు డొల్లతనం ప్రదర్శించడం వల్ల శనివారం సాయంత్రం పడిన భారీ వర్షానికి త్రినాధస్వామి ఆలయంలోకి వర్షపు నీరు చేరింది. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు, భక్తులు మాట్లాడుతూ రహదారి విస్తరణ పనులు అధికారులు కాలువలు సక్రమంగా నిర్మించకపోవడం వల్ల వర్షం పడినప్పుడల్లా రహదారి కింద ఉన్నటువంటి ఇళ్లకు, ఆలయాలకు నీరు చేరుతూ ఇబ్బందులకు గురవుతున్నామని, ఇప్పటికైనా ఆర్అండ్‌బి అధికారులు స్పందించి కాలువలు సక్రమంగా నిర్మించి వర్షం పడినప్పుడు నీరు కాలువలు ద్వారా వెళ్లేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.


ఆలయంలో చేరిన వర్షపు నీరు

తప్పని ఖరీఫ్ కష్టాలు

◆ ఏటా సాగునీరందక ఇబ్బందులు ◆ చోద్యం చూస్తున్న ఇరిగేషన్ అధికారులు

ప్రజాశక్తి - పాలకొండ

ఈ ఏడాది ఖరీఫ్‌కు కూడా తోటపల్లి నీరందే పరిస్థితి కనిపించడం లేదు. తోటపల్లి కాలువల ఆధునీకరణ పనులు నేటికీ జరగకపోవడం కాలువలు పూర్తిగా పాడవ్వడం రైతులకు శాపంగా మారింది. గత వైసిపి ప్రభుత్వంలో తోటపల్లికి నిధులు కేటాయించినప్పటికీ 23 శాతానికి మించి పనులు చేయకపోవడంతో నిధులు వెనక్కి వెళ్లిపోయాయి. దీంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనప్పటికీ నేటికీ తాత్కాలింగా కూడా పనులు చేపట్టకపోవడంతో రైతుల ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా శివారు ప్రాంతాల రైతులకు ప్రతి ఏటా ఇబ్బందులు తప్పడం లేదు. 6, 7 బ్రాంచ్ కాలువ పరిధిలోని భూములకు నీరందాలంటే గగనంగా మారుతుంది. షట్టర్లు పాడవ్వడంతో పాటు పూర్తిగా మదుములు కూడా పాడవడంతో ఈ ఏడాది కూడా ఇబ్బందులు తప్పని పరిస్థితి కనిపిస్తుంది. మండలంలోని ఓని, గరుగుబిల్లి, లుంబురు, కోటిపల్లి, గుడివాడ, బాసురు తదితర ప్రాంతాలకు ప్రతి ఏటా సాగు నీరందక ఇబ్బందులు తప్పడం లేదు. కాలువల్లో కనీసం జంగిల్ క్లియరెన్స్ కూడా చేసిన దాఖలాల్లేవు. దీనివల్ల తోటపల్లి నుంచి నీరు విడిచిపెట్టినా కాలువల ద్వారా నీరందే పరిస్థితి కనిపించడం లేదు.

చోద్యం చూస్తున్న ఇరిగేషన్ అధికారులు

సాగునీరు అందించే విషయంలో అధికారులు చోద్యం చూస్తున్నారు. తోటపల్లి ప్రధాన కాలువ ఆయకట్టుకు సాగునీరిందించాలని ఇటీవల ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో పలుమార్లు స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద అనేక ఆందోళనలు చేపట్టినా అధికారులకు కనీసం చీమకుట్టినట్లయినా అనిపించలేదు. సబ్ కలెక్టర్ యశ్వంత్ రెడ్డి ఆధ్వర్యంలో రైతు సంఘ నాయకులు ఇరిగేషన్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. అయితే అప్పటికి ఆ సమావేశానికి అధికారులు డుమ్మా కొట్టారు. దీనిబట్టి చూస్తే రైతుల పట్ల అధికారులకు ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థమైపోతుంది. మండలంలో 15వేల ఎకరాల్లో వరి సాగువుతుంది. అయితే ఆ స్థాయిలో సాగునీరందడంలేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వారం రోజుల్లో పనులు చేస్తామని చెప్పారు...

సాగునీటి సమస్యపై ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్, కలెక్టర్‌ను రైతులు కలిసినప్పుడు వారం రోజుల్లో కాలువ పనులు చేస్తామని ఇరిగేషన్ అధికారులు చెప్పారు. ఖరీఫ్ ప్రారంభమై 15 రోజులు కావస్తున్నా ఇంతవరకు కాలువలు బాగు చేసే పరిస్థితి లేదు.

కందాపు ప్రసాదరావు,
అభ్యుదయ రైతు .

ప్రతి ఏటా ఇదే సమస్య

ప్రతిఏటా పాలకొండకు సాగునీరు పెద్ద సమస్యగా మారింది. ఎన్ని ప్రభుత్వాలు మారుతున్నా తోటపల్లి ఆధునీకరణ పనులు జరగకపోవడం రైతులకు శాపంగా తయారైంది. ఇరిగేషన్ అధికారులు కూడా దీనిపై నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తున్నారు. రైతులంటే అధికారులకు చులకనగా ఉంది.

ఎద్దు బోయిన సింహాద్రి, రైతు.


తుప్పు పట్టేసిన షట్టర్


తోటపల్లి వద్ద షట్టర్ పాడవడంతో వృథాగా పోతున్న సాగునీరు


పాలకొండ మండలం ఓని వద్ద శిథిలావస్థలో ఆక్విడెక్ట్


జంగిల్ క్లియరెన్స్ జరగకపోవడంతో తుప్పలతో నిండిన తోటపల్లి ఎడమ కాలువ

ప్రేమ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభం

ప్రజాశక్తి- సాలూరు

పట్టణంలో శనివారం ప్రేమ మల్టీ స్పెషాలిటీ హాస్పటల్‌ని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి, మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర ప్రారంభించారు. దండిగాం రోడ్డులో నూతనంగా నిర్మించిన ఆసుపత్రిని డాక్టర్ బి.శామ్యూల్ రాజు నిర్మించారు. వెనుకబడిన ఏజెన్సీ ప్రాంతంలో ఆధునిక వైద్య సదుపాయాలతో ఆసుపత్రిని నిర్మించడం అభినందనీయమని మంత్రి సంధ్యారాణి, మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర అన్నారు.

గుంతల రహదారితో అవస్థలు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని దశమంతపురం గ్రామానికి వెళ్లే రహదారి ఎక్కడికక్కడ గుంతలు ఏర్పడడంతో రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తరచూ ద్విచక్ర వాహనాలు, ఆటోలు మరమ్మతులకు గురి కావడంతో తీవ్రంగా ఆర్థిక ఇబ్బందులు గురవుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే అధికారులు స్పందించి రహదారిని మెరుగుపరచాలని, స్థానికులు కోరుతున్నారు.


అధ్వానంగా తయారైన రహదారి

'తల్లికి వందనం' వర్తింపజేయాలి

మున్సిపల్ కార్మికుల నిరసనలు

ప్రజాశక్తి - సాలూరురూరల్

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పథకాన్ని మున్సిపల్ కార్మికుల పిల్లలకు ఇవ్వకుండా నిలిపివేయడాన్ని ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ తీవ్రంగా ఖండించింది. ప్రభుత్వ తీరుకు నిరసనగా పట్టణంలో నిరసన తెలిపారు. అనంతరం అధికారులకు వినతిని అందించారు. అనంతరం ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎన్వై నాయుడు, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు రాముడు, శంకర్ మాట్లాడారు. చంద్రబాబు ప్రభుత్వం ఎన్నికలకు ముందు సంక్షేమ పథకాలు అందిస్తామని చెప్పి అధికారంలోకి రాగానే తల్లికి వందనాన్ని అట్టడుగున ఉన్న పారిశుద్ధ్య కార్మికుల పిల్లలకు ఇవ్వకుండా దూరం చేస్తున్నారని విమర్శించారు. వెంటనే సాంకేతిక సమస్యలు సరిచేసి తల్లికి వందనంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ పథకాలన్నీ మున్సిపాలిటీలోని అన్ని వర్గాల కార్మికులకు అమలు చేయాలని లేకుంటే భవిష్యత్తులో పెద్ద ఎత్తున పోరాటాలకు వెనుక తగ్గేది లేదని తెలిపారు. ప్రభుత్వం చూపిస్తున్న సాఫ్ట్వేర్‌లో కాంట్రాక్ట్ కార్మికులంతా ప్రభుత్వ ఉద్యోగులని చూపిస్తుందని, అలాంటప్పుడు కాంట్రాక్ట్ కార్మికులందర్నీ రెగ్యులర్‌రైనా చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం అవలంబిస్తున్న ద్వంద్వ నీతిని ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ మహిళా నాయకులు ఇందూ, కమిటీ సభ్యులు రవి, శ్రీను, బాలరాజు, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురంటౌన్ : తల్లికి వందనం మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు, ఇంజినీరింగ్ వర్కర్లకు వర్తింపచేయాలని మున్సిపల్ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ (సిఐటియు) డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. అనంతరం శానిటరి ఇన్‌స్పెక్టర్ పకీరునాయుడుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాగవంశం శంకర్రావు, చీపురుపల్లి సింహాచలం, మామిడి శివ, పి.నరేష్, నాగవంశం మల్లేష్, బి.సంతోష్ కుమార్, లీల, చిరంజీవి, ఈశ్వరమ్మ, లక్ష్మి,



పార్వతీపురం: నిరసన తెలుపుతున్న కార్మికులు



సాలూరు : నిరసన తెలుపుతున్న కార్మికులు

ఎండియు వాహనాల ద్వారా నిత్యావసర సరుకులు అందించాలి

ప్రజాశక్తి - కురుపాం

ఎండియు వాహనాలను కొనసాగించి వాటి ద్వారా ఇంటింటికీ నిత్యవసర సరుకులు అందించాలని ఆదివాసీ గిరిజన సంఘం మండల నాయకులు ఆరిక గంగరావు, అనిల్ డిమాండ్ చేశారు. మండలంలోని జి.శివడ పంచాయతీ సచివాలయం వద్ద కార్యదర్శి ధనంజయకు ఎండియు వాహనాలను కొనసాగించాలని శనివారం వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎండియు వాహనాల రద్దు నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకొని వాహనాలను పునః ప్రారంభించాలని, వీటి రద్దు వల్ల పంచాయతీ కేంద్రానికి దూరంగా ఉన్న గిరి శిఖర గ్రామ ప్రజలు, మహిళలు డిపోకు వచ్చి గంటల తరబడి నిత్యవసర సరుకుల కోసం వేచి ఉండాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. గిరిజనులు నిత్యం ఏదో ఒక కూలి పని చేసి జీవనం సాగిస్తుంటారని, అలాంటిది రేషన్ కోసం కూలీ పనులను వదిలి రావాల్సి వస్తుందన్నారు. అంతేకాకుండా డిపో రెండు నుంచి ఐదు కిలోమీటర్ల దూరం ఉండడం వల్ల కాలినడకన మోసుకొని వెళ్లాల్సి వస్తుందన్నారు. డిపోకి నిత్యవసర సరుకులకు అధికంగా మహిళలు వస్తున్నారని కనీసం డిపో వద్ద ఉండడానికి నిలువ నీడ కూడా లేకుండా డిపో బయట ఎండలో నిల్చొవాల్సిన పరిస్థితి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. కావున ఎండియు వాహనాలను కొనసాగించి 14 రకాల నిత్యవసర సరుకులు ప్రజలకు ఇంటి వద్దకే అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక లబ్ధిదారులు పాల్గొన్నారు.


పంచాయతీ కార్యదర్శికి వినతినిస్తున్న నాయకులు

ఆర్థిక లావాదేవీలపై శిక్షణ

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక మండల మహిళా సమైక్య కార్యాలయంలో శనివారం మండల మహిళా సమాఖ్య అధ్యక్షులు కె.లలితకుమారి ఆధ్వర్యంలో విఒఎలకు ఇఎంటిలు సిహెచ్ నీలాకుమారి, షేక్ నూర్జహాన్ ఆర్థిక లావాదేవీల శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాలు, గ్రామ సంఘాలు, మండల సమైక్యల ఆర్థిక లావాదేవీలను జాతీయస్థాయిలో మొబైల్ యాప్‌లోకి తీసుకురావడానికి ఎన్ఆర్ఎల్ఎం ప్రోగ్రాం ద్వారా ఆన్‌లైన్ చేసే పద్ధతిని విఒఎలకు వివరించారు. కార్యక్రమంలో ఎపిఎం కె.రాము, ఆనందరావు, సిసిలు, విఎఒలు, సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానం చేయండి.. ప్రాణదాతలు కండి

ప్రజాశక్తి- సీతంపేట

సీతంపేట ప్రాంతీయ ఆసుపత్రిలో ప్రపంచ రక్తదాతల దినోత్సవం శనివారం ఏరియా ఆసుపత్రి సూపరింటెండ్ బి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించి రక్తదానం చేసిన యువత నుంచి 15 యూనిట్లు రక్తం సేకరించామని తెలిపారు. రక్తదానం చేయడం వల్ల మరొకరి ప్రాణం కాపాడిన వారు అవుతారని అన్నారు. రక్తం మార్చుకుంటే కొత్త రక్తం ఉత్పత్తి చెందుతుందని ఆరోగ్యంగా ఉంటుందని చెప్పారు. రక్తదానం చేయడానికి యువత ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిన్నపిల్లల వైద్య నిపుణులు మనోజ్‌కుమార్, ల్యాబ్ టెక్నీషియన్ మురళి, పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

◆లేబర్ కోడ్‌లు రద్దయ్యే వరకూ పోరాడదాం ◆సిఐటియు రాష్ట్ర నాయకులు జి.కోటేశ్వరరావు

ప్రజాశక్తి- పార్వతీపురం

కార్మికులకు నష్టం చేసేవిధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ రద్దు అయ్యేంత వరకూ ఐక్యంగా పోరాడదామని సిఐటియు రాష్ట్ర నాయకు జి.కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక సుందరయ్య భవనంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు అధ్యక్షతన జరిగిన జిల్లా సిఐటియు విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికులు ఏళ్ల తరబడి పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలు, హక్కులను బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ల ప్రయోజనాల కోసం వారిచ్చే కమీషన్‌లకు కక్కుర్తి పడి రద్దు చేసిందని చెప్పారు. కార్మిక చట్టాలు, హక్కులు రద్దు చేసి వారిని కట్టు బానిసలుగా మార్చడం కోసం నాలుగు లేబర్ కోడ్స్ తీసుకురావడాన్ని ముక్త కంఠంతో వ్యతిరేకిస్తున్నామన్నారు. ఒక వైపు కార్పొరేట్లకు రుణాలు మాఫీ చేస్తూ, కొత్తరుణాలు ఇస్తూనే మరోవైపు పేద ప్రజలపై చిన్న మధ్య తరహా పరిశ్రమల యాజమాన్యాలపై విద్యుత్ యూజర్ చార్జీలు, జియస్‌టి, పన్నులు వేయడంతో వేల సంఖ్యలో పరిశ్రమలు మూత పడ్డాయని, ఫలితంగా కార్మికులు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. విశాఖ ఉక్కును నష్టాల పేరుతో ప్రైవేట్ పరం చేసే ప్రయత్నం మానుకోవాలన్నారు. రైతుల పంటలకు గిట్టుబాటు ధర ఇవ్వకుండా, కార్పొరేట్ వ్యవసాయం పేరుతో నల్ల చట్టాలు తెచ్చి భూమిని లాక్కునే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. కార్మికుల సమస్యలపైన విశాఖపట్నంలో జరగబోయే ఆలిండియా మహాసభలు కార్మికవర్గం జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో శాసన సభ్యుల వేతనాలు మాత్రమే పెంచుకుని, కార్మికుల జీతం పెంచకుండా పనిగంటలు పెంచి, ఉద్యమాల వైపు రానీయకుండా, సంఘం పెట్టుకునే హక్కు లేకుండా చేస్తున్నారని ఆరోపించారు. కార్మిక హక్కుల కోసం జులై 9న జరిగే సమ్మెను పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా నాయకులు ఎన్వై నాయుడు, వి ఇందిరా, బి వెంకటరమణ, గొర్ల వెంకటరమణ, ఆర్ రాము, వై శాంతకుమారి, ఎం ఉమామహేశ్వరి, రెడ్డి వేణు, గవర వెంకటరమణ, కొల్లి సాంబమూర్తి, అమర వేణి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కోటేశ్వరరావు

జిల్లా వ్యాప్తంగా యోగా కార్యక్రమాలు

ప్రజాశక్తి - పార్వతీపురం

యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం జిల్లాలో పెద్ద ఎత్తున యోగా కార్యక్రమాలు జరిగాయి. అంతర్జాతీయ యోగా దినోత్సవం ఈనెల 21న నిర్వహిస్తున్న నేపథ్యంలో, దీనికి సన్నాహక చర్యలు, యోగా అభ్యాసన కింద ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. జిల్లావ్యాప్తంగా 3,800 ప్రదేశాల్లో యోగా కార్యక్రమాన్ని నిర్వహించగా, ప్రతి చోటా పెద్ద ఎత్తున ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి యోగాలో పాల్గొనడం విశేషం. ఈ ఏర్పాట్లను సంబంధిత ఎంపిడిఒలు, స్థానిక అధికారులు చేపట్టగా, పలు చోట్ల ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలు, పలు ప్రభుత్వ శాఖల సిబ్బంది భాగస్వామ్యమయ్యారు.

కురుపాం : శారీరక మానసిక ఆరోగ్యం యోగాతోనే లభిస్తుందని ఎంపిడిఒ జె. ఉమామహేశ్వరి అన్నారు. యోగాంధ్రా కార్యక్రమాల్లో భాగంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు సచివాలయ సిబ్బంది, కూటమి నాయకులతో యోగా నిర్వహించారు.పలు యోగాసనాలు వేసి యోగ ప్రాముఖ్యత గూర్చి యోగా శిక్షకులు తెలి పారు. కార్యక్రమంలో మండల టిడిపి కన్వీనర్ కెవి కొండ య్య, ఎఎంసి మాజీ చైర్మన్ కోలా రంజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టం: స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయ ఆవరణంలో శనివారం గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్, మండల ప్రత్యేక అధికారి ఆర్.కృష్ణవేణి ఆధ్వర్యంలో యోగా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మేజర్ పంచాయతీ ఇఒ బి.కోటేశ్వరరావు, జూనియర్ సహాయ కులు ఎ.నర్సింగరావు, ఐసిడిఎస్ సూపర్వైజర్లు జ్ఞానమ్మ, రాజేశ్వరితో పాటు ఎఎన్ఎంలు, అంగన్వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు, పాల్గొన్నారు.

సీతానగరం : మండల స్థాయి అధికారులంతా యోగా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ ఎంఎస్ఎన్ ప్రసాద్ మాట్లాడుతూ వ్యాయామంతోనే ఆరోగ్యంగా ఉంటామన్నారు. అలాగే మండలంలోని ప్రతి సచివాలయ పరిధిలో ఆయా గ్రామ సచివాలయ సిబ్బందితో పాటు గ్రామపెద్దలు, వివిధ చిరు ఉద్యోగులు యోగాంధ్ర నిర్వహించారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి కెకె కుమార్ వర్మ, ఎంఇఒ జి.సూర్యదేముడు, తహశీల్దార్ ప్రసన్నకుమార్, ఎపిఎం ఆర్.శ్రీరాములనాయుడుతో పాటు వివిధ మండల స్థాయి అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

వికలాంగులకు యోగా

సాలూరు రూరల్: విభిన్న ప్రతిభావంతులకు, హిజ్రాలకు ప్రత్యేకంగా యోగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించినట్టు నీడ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ పి.వేణుగోపాలరావు తెలిపారు. అంతర్జాతీయ యోగా శిక్షణ కార్యక్రమంలో భాగంగా జిల్లా వికలాంగులు, ప్రతిభావంతుల సంస్థ ఆదేశాల ప్రకారం శనివారం పార్వతీ పురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో వికలాంగులకు, హిజ్రాలకు ప్రత్యేకంగా యోగా శిక్షణ నిర్వహిం చామని తెలిపారు. ప్రతి ఒక్కరూ యోగాను తమ జీవితంలో ఒక భాగం చేసుకోవాలన్నారు. యోగా ద్వారా సర్వరోగాలు ఎటువంటి డబ్బులు ఖర్చు లేకుండా సమయా నుసారం వివిధ రకాల యోగాలు నిర్వహించుకున్నట్లయితే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని తెలిపారు. కార్యక్ర మంలో నీడ్ స్వచ్ఛంద సంస్థ టీమ్ లీడ్ మోహన్ రావు, వికలాంగులు, హిజ్రాలు పాల్గొన్నారు.

పార్వతీపురంరూరల్: ప్రస్తుత జీవన విధానంలో యోగాను ప్రతి ఒక్కరూ దినచర్యలో భాగంగా అలవాటు చేసుకోవాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు అన్నారు. యోగాంధ్ర మాసోత్సవ కార్యక్రమంలో భాగంగా బాలగుడబ, చినబొండపల్లిలో శనివారం యోగా సెషన్ నిర్వహించి అవగాహన కల్పించారు. డిఎంహెచ్ఒ, వైద్యాధికారులు, వైద్య సిబ్బంది, గ్రామస్తులతో కలిపి యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి. జగన్మోహనరావు, బందలుప్పి, పెదబొండపల్లి పిహెచ్‌సిల వైద్యాధికారి డాక్టర్ ఎన్.ఎం.కె తిరుమల ప్రసాద్, సర్పంచ్ సూర్యనారాయణ, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది, పాల్గొన్నారు.

భామిని: ప్రస్తుత సమాజంలో తీవ్రమైన మానసిక ఒత్తిడి నుండి ఉపసమనం కలిగించడానికి, శారీరకంగా మానసికంగా ధృఢంగా ఉండడానికి యోగా మీరోజు వారి జీవనంలో ఒక అలవాటుగా మారాలని, క్రమం తప్పకుండా యోగా సాధన చేయాలని గిరిజన సంక్షేమ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కుమార్ అన్నారు. శనివారం భామిని గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో, ఘనసర గ్రామంలో యోగాంధ్ర కార్యక్రమంలో ప్రత్యేకాధికారిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఘనసర గ్రామంలో స్థానికులు కలిసి పలు యోగాసనాలు వేసి యోగా ప్రత్యేకతను వివరించారు..


సాలూరు: యోగా చేస్తున్న వికలాంగులు


కురుపాం: యోగా చేస్తున్న ఉద్యోగులు



పార్వతీపురం: యోగాచేస్తున్న డిఎంఅండ్‌హెచ్‌ఒ, తదితరులు